క్లుప్తంగా

అక్రమ రవాణాపై అవగాహన

దమ్మపేట: అక్రమ రవాణాదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై సాయి కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గట్టుగూడెం ప్రభుత్వం పాఠశాలలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని, పురస్కరించుకొని యాక్షన్‌ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఐడీ సంస్థ మొబలైజర్ మోహన్, హెచ్‌ఎం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగించిన సీఐ

మణుగూరుటౌన్: ఏడాది క్రితం పొగొట్టుకున్న మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌ను మంగళవారం సీఐ సతీష్‌కుమార్ తిరిగి అప్పగించారు. మండలంలోని సమితిసింగారం వివేకానంద నగర్ తుళ్లూరి భానుప్రకాశ్‌కు చెందిన ఫోన్ ఏడాది క్రితం పోయింది. పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోన్ ఆచూకి తెలుసుకుని సీఐ సతీష్‌కుమార్ అప్పగించారు.

ఇనుప వస్తువుల తరలింపు ఘటనపై విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట ఆశ్రమ పాఠశాలలో అనుమతులు లేకుండా పాత ఇనుము తరలింపు ఘటనపై ఏటీడీఓ అశోక్ మంగళవారం విచారణ చేపట్టారు.గత రెండు రోజుల క్రితం ఆశ్రమ పాఠశాలకు చెందిన పాత ఇనుప వస్తువులను బొలెరో వాహనంలో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్న సంగతి విధితమే. కాగా ఆ ఘటనపై ఏటీడీఓ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని హెచ్‌యం, ఉపాధ్యాయుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. అలాగే అడ్డుకున్న గ్రామస్తులను నుంచి కూడా వివరాలను నమోదు చేసుకున్నారు.

బాధ్యత వహించాలి

మణుగూరుటౌన్: ఇటీవల కారులో అగ్ని ప్రమాదానికి గురైన కార్మికుడికి సరైన సమయంలో వైద్యం అందకే మరణించాడని, దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 22న ప్రమాదవశాత్తూ కారులో అగ్ని ప్రమాదానికి గురైన కార్మికుడు రామ్మోహన్‌కు కొత్తగూడెం పంపే సమయంలో కనీసం ప్రథమ చికిత్సలు నిర్వహించలేదని, హైదరాబాద్‌లోని ఆస్పత్రుల వారు సైతం నిర్లక్ష్యం వహించారని అన్నారు. దీనిపై యాజమాన్యం విచారణ చేపట్టి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని ముద్రించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆ పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు గనులను వేలం వేస్తే కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని, సంస్థ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, నాయకులు ఈశ్వరరావు, నరసయ్య, వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరి రుణాలు మాఫీ చేయాలి

చండ్రుగొండ: పట్టా పాసుపుస్తకాలు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేయడం సరికాదని, రైతులందరి రుణాలు మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతువేదికలో మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, మెడా మోహన్‌రావు నరుకుళ్ల వాసు, దశరథ్ రాములు పాల్గొన్నారు.

ములకలపల్లి: తెలంగాణా పట్టా పాస్‌బుక్‌తో సంబంధంలేకుండా అర్హులందరికీ రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ అన్నారు. మంగళవారం ములకలపల్లిలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగుదారులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని కలివేరు, తేగడ, చినమిడిసిలేరు, దానవాయిపేట, మామిడిగూడెం, బోటుగూడెం, బోదనెల్లి, శివలింగాపురం గ్రామాల్లో మంగళవారం వైద్య సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించారు.

జీవో 22 అమలు చేయాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీవో 22ను అమలు చేసి నెలకు 20వేలు అందించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నందం ఈశ్వర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కార్మికులనుద్దేశించి రామాలయం వద్ద మాట్లాడారు. నాయకురాలు ఇమాంబి, ఉపేంద్ర, నాగేశ్వరరావు, భీమయ్య, రంగయ్య, నాగరాజు, రాందాస్, సుజాత, అంకమ్మ తదితరులు ఉన్నారు.

చీకట్లో మగ్గుతున్న మణుగూరు

- నెలల తరబడి వెలగని వీధిలైట్లు
- పాములు, విషకీటకాల భయంతో ప్రజానీకం
- కాంట్రాక్టర్ నిర్వాకంతో తల పట్టుకుంటున్న అధికారులు



మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం

మణుగూరుటౌన్: దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరు మున్సిపాలిటీలోని ప్రధాన ప్రాంతాలు వీధి లైట్ల కొరతతో చీకట్లో మగ్గుతున్నాయి. వర్షం వచ్చిందంటే పాములు, విషకీటకాలు బయట సంచరిస్తుండటంతో క్షణం క్షణం భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. ఏడు సంవత్సరాలపాటు వీధిలైట్లు సప్‌లై చేయడానికి కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తూ వీధిలైట్లు పంపిణీ చేయకపోవడంతో ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి వీధిలైట్లు పెట్టాలంటూ వచ్చే ఫిర్యాదులకు సమాధానం చెప్పలేక మున్సిపాలిటీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

1600కు పైగా వీధిలైట్లు లేవు..

మున్సిపాలిటీ పరిధిలో ఉండే 20 వార్డుల్లో ప్రధాన ఏరియాలైన రాయిగూడెం, కమలాపురం, అన్నారం, సుందరయ్యనగర్(కుంకుడుచెట్ల గుంపు), శివలింగాపురం, విఠల్‌రావ్‌నగర్, కొత్తకొండాపురం, ఆదర్శ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, గాంధీనగర్ ఏరియాల్లో వీధి లైట్లు మరమ్మతులకు గురై దాదాపు నెలలు దాటుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏకైక (ఈఈఎస్‌ఎల్)కాంట్రాక్టర్ మణుగూరు మున్సిపాలిటీ బాధ్యత 2017లో దక్కించుకున్నాడు. అది ఏడు సంవత్సరాల గడువు ఉండటంతో నేటికీ కొనసాగుతోంది. అయితే కాంట్రాక్ట్ వచ్చిన తొలి మూడు సంవత్సరాలు సజావుగా సాగిన వీధి లైట్ల మరమ్మతులు, కొత్త లైట్ల ఏర్పాటు.. ఆ తర్వాత క్రమక్రమంగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రధాన రహదారి మినహా దాదాపు అన్ని గ్రామాల్లో అక్కడక్కడా వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మణుగూరు మున్సిపాలిటీల్లో 20 వార్డుల్లో 1600పై చిలుకు వీధిలైట్లు లేవు. 823 చోట్ల అత్యవసర ప్రదేశాల్లో వీధిలైట్లు జాడలేదు. ఈ విషయమై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అవి అపరిష్కృతంగానే ఉన్నాయి. ఇప్పటికే ఈ విషయంపై పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన మున్సిపాలిటీ అధికారులు సమస్య పరిష్కారం కాకపోవడంతో వానకాలం ఎలా గట్టెక్కుతామో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

లైట్లు పంపడం లేదు..

వీధి లైట్ల కాంట్రాక్ట్ దక్కించుకున్న (ఈఈఎస్‌ఎల్) కంపెనీ ఏడు సంవత్సరాలలో నిబంధనల ప్రకారం పనిచేసింది కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే అని సమాచారం. ఆ సమయంలో ఏడాదికి వచ్చేది 60- 70 రిపేర్లు మాత్రమే. వాటిల్లోనూ వీధిలైట్ల డ్రైవ్, పీసీబీ మెయింటెన్స్‌తో సరిపెట్టుకునేవారు. ఆ మూడు సంవత్సరాల దాటాక చూస్తాం చేస్తాం పంపుతాం అంటూ సమాధానం తప్ప ఆచరణలోపెట్టింది లేదు. ఒక్కోసారి స్పందన కూడా కరువవుతోంది. ఈ నేపథ్యంలో ఎవరిని అడగాలో మున్సిపాలిటీ అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కనీసం సమస్యాత్మకంగా మారిన ప్రధాన ఏరియాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి చీకట్లో మగ్గుతున్న గ్రామాలకు వెలుగులు పంచాలని స్థానికులు కోరుతున్నారు.

వీధిలైట్లు లేవు..



వీధిలైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. శివలింగాపురం కట్ట ప్రధాన ఏరియాలో చీకటి అయితే బయట నడవలేని దుస్థితి. వర్షం వస్తే కాల్వల్లో పారే నీళ్ల ద్వారా పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయి. మణుగూరు శివలింగాపురం ఏరియాలతో పాటు మణుగూరులోని అన్ని ఏరియాల్లో వెంటనే వీధి లైట్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– జానీ, శివలింగాపురం

పరిష్కారానికి కృషి చేస్తున్నాం..



వీధి లైట్ల కొరత ఉంది. కాంట్రాక్టర్ సూపర్‌వైజర్‌కు పలుమార్లు చెప్పాం. పంపిస్తాం అంటున్నారు. పంపడం లేదు. వానకాలం సమస్య తీవ్రంగా ఉంది. పాములు తిరుగుతున్నాయని స్థానికుల నుంచి లైట్లు పెట్టాలంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

– ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్

దివ్యాంగులకు బస్ పాస్‌లు


దివ్యాంగుడికి రాయితీ బస్ పాస్ అందజేస్తున్న డీఎం శ్యాంసుందర్

మణుగూరురూరల్: పట్టణంలోని సురక్షాబస్టాండ్ ప్రాంగణంలో టీజీఎస్‌ఆర్టీసీ మణుగూరు డిపో ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు రాయితీ బస్ పాస్ మేళా నిర్వహించారు. ఈ మేళాను ముఖ్య అతిథిగా హాజరైన డిపో మేనేజర్ కె.శ్యాం సుందర్ ప్రారంభించి అర్హులైన దివ్యాంగులకు రాయితీ బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం శ్యాంసుందర్ మాట్లాడుతూ.. రాయితీ బస్ పాసులతో డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో రాష్ట్ర మంతటా దివ్యాంగులు 50 శాతం రాయితీపై ప్రయాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంచార్జ్ సీఐ కనకదుర్గ, శ్రీనివాసరావు, విలేజ్ బస్ ఆఫీసర్స్ సిహెచ్ ఉపేందర్‌రావు, తాటి సుధాకర్, ఆయిల్ డీఐ పీవీ రెడ్డి, బస్ పాస్ కౌంటర్ యు.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బూర్గంపాడులో..

బూర్గంపాడు: ఆగస్టు 1వ తేదీన బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో టీజీఎస్ ఆర్టీసీ భద్రాచలం డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. మంగళవారం ఓ ప్రకటనలో దివ్యాంగులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో 50 శాతం రాయితీతో ప్రయాణం చేయవచ్చని తెలిపారు. రాయితీ బస్‌పాస్‌ల కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, రూ 50 నగదు తెచ్చుకోవాలని సూచించారు వివరాల కోసం 7382857119, 9492309101, 9849560226 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

భద్రాచలంటౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రాచలం డిపోలో ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లగా గుర్తింపు పొందిన వారిని సన్మానించారు. ఖమ్మంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ డ్రైవర్లు తాతాజీరావు, యాకేశ్వరరావు, శేఖర్‌లను ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరాం నాయక్ ఘనంగా సన్మానించడంతో పాటు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక తోడ్పాటు

బూర్గంపాడు: గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీలో సీటు సాధించిన ఆదివాసీ విద్యార్థిని వాసం సుస్మిత చదువులకు ఐటీసీ అనుబంధ భద్రాద్రి మహిళా సమితి(బీఎంఎస్) ఆర్థిక తోడ్పాటును అందించింది. మంగళవారం బీఎంఎస్ ప్రతినిధులు వాజేడు మండలం నాగారం గ్రామానికి చెందిన వాసం సుస్మిత ఇంటికి వెళ్లి ఆమెకు రూ.25వేల చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ అధ్యక్షురాలు కవితా కులకర్ణి మాట్లాడుతూ.. ప్రచార మాధ్యమాలలో సుస్మిత చదువుల కోసం పడుతున్న ఆర్థిక ఇబ్బందుల కథనాలను చదివి స్పందించి చేయూతనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్రతినిధులు రేష్మా ప్రణవ్, ఆల్కా ప్రవుల్, శిరీషా, ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ మేనేజర్ చెంగలరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి

అశ్వాపురం: గోదావరి పరివాహక ప్రాంతాల్లో రెండు సార్లు వరదలతో నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని సీడ్‌కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో ఆయన ఛాంబర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గోదావరి వరదల రైతులు తీవ్రంగా నష్టపోయారని సబ్సిడీపై విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలని కేశవరెడ్డి కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

నిరుపయోగంగా లైబ్రరీ

మణుగూరుటౌన్: రూ.కోటి వ్యయంతో ముత్యాలమ్మనగర్ వద్ద ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్మించిన గ్రంథాలయం నిరుపయోగంగా మారిందని, దీనిని వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఉపయోగపడేలా చేయాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని నిర్మించి ఏడాది గడుస్తున్నా ఇందులో పుస్తకాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పుస్తకాలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా ఎంపిక

భద్రాచలంటౌన్: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటికో స్పీకర్ ఊరికో ట్రైనర్ అనే లక్ష్యంతో నిర్వహించిన ట్రైన్ ద ట్రైనర్స్ శిక్షణ శిబిరంలో భద్రాచలం పట్టణానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ జీవీవీ ఎస్ ఆర్‌కే చారి ఎంపికయ్యారు. 30 రోజులు ఆన్‌లైన్‌లో రెండు రోజులు సికింద్రాబాద్ మినర్వా గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన ఆఫ్‌లైన్ సెషన్స్‌లోనూ పాల్గొని ట్రైనింగ్ పొంది ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా సర్టిఫికెట్‌తో పాటు ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైలర్‌గా అర్హత పొందారు. ఈ సందర్భంగా చారి మాట్లాడుతూ.. సర్టిఫికెట్‌ను ప్రముఖ నటుడు, లైఫ్ కోచ్ పర్సనాలిటీ డెవలప్మెంట్ కార్పొరేట్ డెవలప్మెంట్ ట్రైనర్ కెవి ప్రదీప్, మాస్టర్ మోటివేటర్ నాగేశ్వరరావుల చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

పంపు ఆపరేటర్ మృతి

అశ్వారావుపేటరూరల్: పంప్ ఆపరేటర్‌గా పని చేసిన అశ్వారావుపేట మేజర్ పంచాయతీ పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన కోటగిరి రామకృష్ణ(76) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ.. మంగళవారం పరిస్థితి విషమించి మరణించారు. 30 ఏళ్లుగా మేజర్ పంచాయతీ పంపు ఆపరేటర్‌గా సేవలు అందించిన రామకృష్ణ, కొద్ది నెలల క్రితమే ఆరోగ్యం సహకరించకపోవడంతో విధుల నుంచి తప్పుకున్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

బూర్గంపాడు: బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులను పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వర్షాలు, వరదలతో మండల కేంద్రం అపరిశుభ్రంగా మారిందని, చర్యలు తీసుకోవాలని అన్నారు.

రుణమాఫీ సంబురాలు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రగొండలోని రైతువేదికలో రుణమాఫీ సంబురాలు మంగళవారం నిర్వహించారు. రెండో విడతగా రూ. 1.5 లక్షల వరకు రుణాలను మాఫీ జాబితా విడుదల నేపథ్యంలో ఏఓ వినయ్, ఏఈఓ విజయ్, శ్రీనివాస్, భాను, రైతులు కార్యక్రమం నిర్వహించారు.

అన్నపురెడ్డిపల్లి: రైతువేదికలలో నిర్వహించిన రుణమాఫీ సంబరాలలో రైతులు పాల్గొని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని తిలకించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఓ అనూష, గుంపెన సొసైటీ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, బోడా పద్మ, నేరెళ్ల లాలయ్య, గఫార్, కట్టా శివయ్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని అనంతారం రైతు వేదికలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మండలంలోని రైతులు, అధికారులు పాల్గొని సీఎం ప్రసంగాన్ని, రుణమాఫీ ప్రక్రియను విన్నారు. ఈ కార్యక్రమంలో


అన్నపురెడ్డిపల్లి: సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని వింటున్న రైతులు

ఏఈఓలు అనిల్ కుమార్, ప్రశాంత్ కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని రైతు వేదికలో రెండో దఫా రైతు రుణమాఫీ ప్రక్రియను వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా విడుదలను స్థానిక రైతులు వీక్షించారు. కార్యక్రమాన్ని అశ్వారావుపేట, నారాయణపురం సొసైటీ చైర్మన్లు చిన్నంశెట్టి సత్యనారాయణ, నిర్మల వుల్లారావు, ఏఓ నవీన్, ఏఈఓలు సతీష్, షాకిరా బాను, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వాలు నమోదు చేయాలి

మణుగూరుటౌన్: యూనియన్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూనే 100 శాతం సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ అన్నారు. మంగళవారం మణుగూరులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అధ్యక్షతన బ్రాంచి కమిటీ సమావేశం నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 99శాతం సభ్యత్వం పూర్తి చేసిన ఓసీ–4 ఫిట్ సెక్రటరీ, బ్రాంచి కార్యదర్శులను అభినందించారు. అనంతరం పలు కార్మిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టయ్య, రాములు, షొబుద్దీన్, నాయుడు, జయరాజు, శ్రీనివాస్, సంతోష్ చరణ్ బొడ్డు, ప్రతాప్‌రెడ్డి, రామారావు, సుధాకర్, నరేశ్, దుర్గా ప్రసాద్, మల్లేశ్, రాము, రామకృష్ణ, సురేశ్, రాందాస్, బానోత్ కృష్ణ తదితరులు ఉన్నారు.

విజయనగరంలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని విప్పలసింగారం గ్రామపంచాయతీ చెరువుముందు సింగారం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది వివిధ రుగ్మతలతో బాధపడుతున్న గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. వీరిలో పలువురి జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించారు. అలాగే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం గ్రామస్తుల ఇళ్లను సందర్శించి పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పిలు వెంకటలక్ష్మి, సమ్మక్క, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: ప్రకృతి వైపరీత్యాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అతిథులుగా మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ వి.రాఘవ రెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ ఉమామహేశ్వరరావులు హాజరై మాట్లాడారు. అనంతరం ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని, వరదల్లో చిక్కుకున్నప్పుడు ఎలా సురక్షితంగా బయటపడాలి వంటి అంశాలను ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రత్యక్ష పద్ధతిలో వివరించారు. ఈ సదస్సులో ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, ఎంపీఓ పి.వెంకటేశ్వర రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశాల ముందస్తు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ముగ్గురు ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో అసెంబ్లీని ముట్టడించడానికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను భద్రాచలంలో ముందస్తుగా అరెస్టు చేశారు.

దుమ్ముగూడెం: పెంచిన జీతాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టిన ఆశా వర్కర్‌లను ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్ట్ చేశారు. హైదరబాద్‌లో మంగళవారం ఆశా వర్కర్‌లు చేపట్టిన కార్యక్రమానికి బయల్దేరుతున్న ఆశాలు, పంచాయతీ కార్మికులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ములకలపల్లి: చలో హైదరాబాద్‌కు వెళుతున్న తమను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని జీపీ కార్మికులు, ఆశా వర్కర్లు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ముందస్తు అదుపులోకి తీసుకున్న వ్యక్తులను సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు తెలిపారు.

విద్యార్థులకు ‘తిథి’ భోజనం


దుమ్ముగూడెం: విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: దాతల సహకారంతో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు తిథి భోజనం అందించారు. అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలలోపాటు మరికొన్ని పాఠశాలల్లో దాతలు జీవీఆర్ కురగాయాల దుకాణం, కేశవ ఫెర్టిలైజర్స్ అశ్వారావుపేట వారి సహకారంతో మధ్యాహ్న భోజనం మెనుతోపాటు అదనంగా పలు రకాల ఊరలు, స్వీట్లు, అరటిపండుతో భోజనం పెట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిత మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న పీఎం పోషణ్‌లో భాగంగా అదనపు పోషక విలువలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తిథి భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, కిషోర్, నర్సింహారావు, సాజీదా, దాతలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా ప్రభుత్వ ఆదేశానుసారం తిథి భోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ పూజారి రత్నకుమారి, ఐకేపీ సభ్యులు కృష్ణవేణి, దుర్గారాణి,వెంకట నరసమ్మ,నాగరాజు, భద్రమ్మ సహకారంతో విద్యార్థులందరికీ పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ కీసర లక్ష్మి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, వారిలో దాగి ఉండే సామర్థ్యాలను వెలికి తీయాలని అశ్వారావుపేట ఎంఈఓ కీసర లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు అందించే నాస్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. త్వరలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలపై జాతీయ స్థాయి సర్వే నిర్వహిస్తుందని, ఈ సర్వేకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. దీని కోసమే నిర్దేశించిన రెండు రోజుల శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోని, ఆర్పీలు అందించే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు హరిత, వెంకయ్య, వీరేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రామనామ భజన

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని భద్రాద్రి హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రామనామ భజన మంగళవారంతో ముగిసింది. ఈనెల23న పశ్చిమగోదావరి జిల్లా అర్ధవరం శివరమణ క్షేత్రం భక్త బృందంలో 36మంది సభ్యులు ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ శ్రీ రామనామం స్మరిస్తూ భజన చేస్తూ రామనామం స్మరించారు. పాతపాటి సత్యనారాయణ రాజు, క్లోపల్లి బలరామ రాజు, సావిత్రి, క్లోపల్లివరలక్ష్మి, గాదిరాజు వల్లి, వెగేశ్న వెంకట లక్ష్మి, రుద్రరాజు సుబ్బమ్మ, దండు వరలక్ష్మి భక్త బృందం వారితో పాటు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభపై ప్రచారం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జులై 18న నిర్వహించాల్సిన గ్రామసభను.. ఆ సమయంలో సరిపడా కోరం సభ్యులు లేకపోవడంతో పాటు, పలు విమర్శల కారణంగా సంబంధిత అధికారులు వాయిదా వేశారు. మరో సారీ గ్రామ సభ వాయిదా పడకుండా ఉండేందుకు గాను గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా భద్రాచలం పట్టణ ప్రజలకు గ్రామ సభ నిర్వహణ పట్ల అవగాహన కల్పించే విధంగా పట్టణం వ్యాప్తంగా మైక్ ద్వారా ఆగస్టు 1వ తేదీన ఉదయం 10:30 నిమిషాలకు భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభను నిర్వహించనున్నట్లుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.